www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 నవంబరు 2022



ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటన..!

ఏలూరు ప్రతినిధి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన ఖరారైంది. ఈ నెల 30న ఉదయం కలపర్రు టోల్‌గేట్ వద్ద నుంచి చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతుంది. పెదవేగి మండలం విజయరాయి వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడతారు. అక్కడే 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అక్కడ నుంచి దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల సరిహద్దు గ్రామం రామచంద్రాపురంలో రైతులతో మాట్లాడతారు. సాయంత్రం చింతలపూడి చేరుకుని రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. డిసెంబరు ఒకటో తేదీన చింతలపూడిలో బయల్దేరి తాడువాయి, బుట్టాయగూడెం మీదుగా రోడ్ షో చేసుకుంటూ పోలవరం చేరుకుంటారు. పోలవరం నుంచి బయలుదేరి రాత్రికి కొవ్వూరు చేరుకుని బహిరంగ సభలో పాల్గొని అక్కడే బస చేస్తారు. రెండో తేదీన నిడదవోలు చేరుకుని అక్కడ నుంచి రోడ్ షోగా తాడేపల్లిగూడెం చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు.

సాగునీరు పుష్కలమే..!

దాళ్వాలో పూర్తి ఆయకట్టుకు నీరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు

101 టిఎంసిల గోదావరి నీరు అందుబాటులో ఉన్నట్లు లెక్కలు

30వ తేదీ నుంచి సాగునీరు విడుదలకు సన్నాహాలు

జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఊసే కరువు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరిలో పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో ఉండటంతో దాళ్వాలో రెండు జిల్లాల్లోనూ పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ప్రతియేటా సాగునీటి సరఫరాపై పెద్దఎత్తున చర్చ సాగేది. పూర్తి ఆయకట్టుకు నీరందించాలా వద్దా.. అందిస్తే ఏవిధంగా అందించాలనే దానిపై తర్జనభర్జనలు జరిగేవి. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాళ్వాలో 4.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.36 లక్షల ఎకరాల ఆయకట్టులో రైతులు పంటను సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే దాదాపు 83 టిఎంసిలు నీరు అవసరం. ప్రతియేటా నవంబర్ నెలాఖరు వచ్చేసరికి గోదావరిలో నీటిలభ్యత లెక్కల ప్రకారం 61 టింఎసిల నీరు మాత్రమే అందుబాటులో ఉండేది. ఈ నీరు కేవలం 74 శాతం ఆయకట్టుకు మాత్రమే సరిపోతుందని, మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే కష్టమని అధికారులు తేల్చేవారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాల్లో దీనిపై పెద్దఎత్తున చర్చ సాగేది. దీంతో సీలేరు జలాలను లెక్కలుగట్టి వంతులవారీ విధానంలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించేవారు. అడ్డుకట్టలు ఎక్కడ వేయాలి వంటి ప్రణాళికలు రూపొందించేవారు. జిల్లాలో 11 ప్రధాన కాలువలు, 300కు పైగా పిల్లకాలువల ద్వారా సాగునీటి సరఫరా సాగుతోంది. దీంతో ఎక్కడ ఎటువంటి చర్యలు తీసుకోవాలో చర్చించేవారు. ఈ ఏడాది అటువంటి క్లిష్టపరిస్థితులు లేవని సాగునీటి లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహాల లెక్కల ప్రకారం 101 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తేల్చారు. దీంతో దాళ్వాకు సాగునీటి కొరత ఉండదని తేలిపోయింది. జనవరి తర్వాత నీటి ప్రవాహాల ఆధారంగా వంతుల వారీ విధానం అమలు చేయాలా వద్దా అనేది నిర్ణయించే అవకాశం ఉంది. సాగునీటి కొరత లేదని తెలియడంతో రైతులు సైతం దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

30న సాగునీరు విడుదలకు సన్నాహాలు

ప్రతియేటా దాళ్వాకు సాగునీటి సరఫరాపై జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలు, కలెక్టర్, జెసితోపాటు అధికారులంతా పాల్గొంటారు. సాగునీటి సరఫరా, సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న దాళ్వాకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లాలో మాత్రం ఇప్పటికీ సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణపై ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. ఈ నెల 30న జిల్లాలో ఐఎబి సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అదే రోజు సాగునీటిని విడుదల చేయనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా సమావేశంలో ప్రకటించడంతో సమావేశం నిర్వహిస్తారా అనే అనుమానం కలుగుతోంది.

వెంటాడుతున్న ఆధునికీకరణ సమస్య

గడిచిన మూడేళ్లలో జిల్లాలో పంట కాలువలకు సంబంధించి ఎటువంటి ఆధునికీకరణ పనులూ జరగలేదు. దీంతో చాలా పంట కాలువలు మెరకతేలిపోయి ఉన్నాయి. దాళ్వాలో సాగునీరు కిందకు పారక ప్రతియేటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసారీ అటువంటి ఇబ్బందులు తప్పవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పవా అనే పరిస్థితి నెలకొంది. సాగునీటికి ఇబ్బంది లేకుండా అత్యవసర పనులు వెంటనే చేయాలని రైతులు కోరుతున్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం కోసం కృషి చేస్తా

ఐటిడిఎ వద్ద ధర్నాలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని, దీనికోసం తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. కెఆర్‌పురంలోని ఐటిడిఎ వద్ద ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సాబ్జీ మాట్లాడుతూ 2020 జూన్ 18న టిఎసి తీర్మానం మేరకు ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని నిర్ణయించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. దీనికోసం గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వంతో ప్రాతినిధ్యం చేస్తామన్నారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు మాట్లాడుతూ పండిట్ పోస్టులను జిల్లా పరిషత్‌లు వర్గోన్నతి చేసి రెండు సంవత్సరాలైనా కావస్తున్నా గిరిజన సంక్షేమ శాఖలో ఇంతవరకు వర్గోన్నతి చేయకపోవడం బాధాకరమన్నారు. దీనికి సంబంధించిన ఫైలు ఎక్కడ పెండింగులో ఉందో అధికారులు గమనించి వెంటనే వర్గోన్నతికి సంబంధించిన ఉత్తర్వులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కెఆర్‌పురం ఐటిడిఎ ఉప విద్యా శాఖ అధికారి పోస్టుకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను నియమించేందుకు సిద్ధం చేసిన సీనియార్టీ జాబితాపై ఈ నెల 24వ తేదీలోపు అభ్యంతరాలు స్వీకరించి అర్హుడిని డివైఇఒగా నియమించాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు మాత్రమే హక్కు ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం కోసం కలిసొచ్చే ఆదివాసీ సంఘాలతో ఐక్య పోరాటం చేస్తామన్నారు. ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలకు ఉన్న హక్కులను కాపాడడానికి ఆదివాసీలంతా సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెల్లం రాంబాబు, ఎటిఎ జిల్లా అధ్యక్షులు సోడియం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, నేతలు దేవరాజు, పి.రమేష్, కోరం రమేష్, ఉయికె ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో కోడి వ్యర్థాలను వినియోగిస్తే

అనుమతులు రద్దు

మత్స్యశాఖ జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు


ఆక్వా రైతులు అక్రమంగా కోడి, ఇతర వ్యర్థాలు వాడితే ఆ చెరువుల లైసెన్స్, అనుమతులు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మత్స్యశాఖ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఆక్వా రైతులు కోడి వ్యర్థాలను ఉపయోగిస్తే వాటిని పంపిణీ చేస్తున్న వాహనాలను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రధాన మంత్రి మత్స్యశాఖ సంపద యోజన కింద 2020-21, 2021-22 సంవత్సరాల మొత్తం 164 యూనిట్స్ ప్రతిపాదనలు రాగా 163 ప్రతిపాదనలను కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 2 నుంచి సిఐటియు రాష్ట్ర మహాసభ

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సిఐటియు రాష్ట్ర మహాసభ జనవరి 2,3,4 తేదీల్లో భీమవరంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఐటియు ఆవిర్భవించిన 52 ఏళ్ల తర్వాత మొదటిసారిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 16వ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభ తొలిరోజు 50 వేల మంది ఉద్యోగ, కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగసభ జరుగుతుందని, ముఖ్యఅతిథిగా కేరళ సిఎం పినరాయి విజయన్ హాజరవుతారని తెలిపారు. సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింగరావు, ఎంఎ.గఫూర్ పాల్గొంటారన్నారు. ఈ సభకు ఏలూరు జిల్లా నుండి 10 వేల మంది కార్మికులను సమీకరించాలని నిర్ణయించామన్నారు. జిల్లాలోని నాలుగు లక్షల మంది కార్మికుల్లోకి ఈ మహాసభ వాణిని తీసుకెళ్లేలా ప్రచారం చేస్తామన్నారు. జనవరి ఒకటో తేదీ నుండి నాలుగో తేదీ వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయుల, అన్నివర్గాల ప్రజలు ఆర్థిక సహకారం అధించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాధం, వి.సాయిబాబు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ

ప్రతి పాఠశాలలోనూ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయాలి : సాబ్జీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశంలోని మానవ వనరులు సంపూర్ణంగా వినియోగంలోకి రావాలంటే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో అధిక సంఖ్యలో శాస్త్రవేత్తలను తయారు చేయొచ్చని చెప్పారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం చేసిన కృషి అభినందనీయమని, దీంతోపాటు ప్రతీ పాఠశాలలో కోటి రూపాయలతో సైన్స్‌ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తే ఎంతోమంది ప్రతిభావంతులను వెలికి తీయొచ్చన్నారు. ల్యాబ్‌లలో వర్కింగ్ మోడల్స్‌తో పనిచేయడం వల్ల మరింత అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. ప్రభుత్వం ఏడాదికి ఒకసారి సైన్స్ ఫేర్ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రతీపాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుపై శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.ఉమాదేవి, కొనల వరప్రసాద్, ఎంవి.త్రిపురేశ్వరి, ఎస్.కొండలరావు, శివ పాల్గొన్నారు.

టి.నరసాపురం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి సైన్స్ ఫేర్‌లు దోహదపడతాయని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాద్ తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం పాఠశాల స్థాయి సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పాఠశాలస్థాయిలో ఎంపికైన నమూనాలు వచ్చేనెల 12, 13 తేదీల్లో మండల స్థాయిలో ప్రదర్శించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎల్.శరత్ బాబు, బి.వాసు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదయ్యేలా చర్యలు

ఓటర్ల జాబితా సవరణ రాష్ట్ర పరిశీలకులు ఎంవి.శేషగిరిబాబు



మాట్లాడుతున్న శేషగిరిబాబు

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా శాఖ కమిషనర్, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు మిరియాల వెంకట శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం ఓటర్ల జాబితా సవరణ ప్రత్యేక అధికారులు, అఖిలపక్ష నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా శేషగిరిబాబు మాట్లాడుతూ పోలింగ్ బూత్‌స్థాయి అధికారులకు ఎఇఆర్‌ఒల ద్వారా ఓటర్ల నమోదు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై ఎటువంటి విచారణ చేయాలి, ఏఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ అందించాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యంతరాల సమయంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని పరిష్కార విధానాన్ని ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకటనను ఈ నెల 9వ తేదీన విడుదల చేశామన్నారు. డిసెంబర్ 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి 26వ తేదీలోగా అభ్యంతరాలను పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే జనవరి 5వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణపై ప్రతి గ్రామంలోనూ టాంటాం, మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. బిజెపి ప్రతినిధి నెరుసు నెలరాజు, టిడిపి ప్రతినిధి పాలి ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సమయంలో ఒక వార్డులోని ప్రజల ఓట్లు పక్కవార్డులోని జాబితాలో నమోదయ్యాయని, వాటిని సరిదిద్దాలని కోరారు. వైసిపి ప్రతినిధి కలవకొల్లు సాంబ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ బదిలీ ఐన, చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని కోరారు. సిపిఎం ప్రతినిధి బి.సోమయ్య మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఓటర్ల నమోదు, సవరణలపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద విభిన్న ప్రతిభావంతులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో డిఆర్ఒ ఎవి.సత్యనారాయణమూర్తి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.బాలాజీ, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిశోర్, ఝాన్సీరాణి, బిఎస్‌పి ప్రతినిధి సిర్ర భరత్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన శేషగిరిబాబు

పెదపాడు: మండలంలోని వట్లూరు గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెంబర్.136ను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా శాఖ కమిషనర్, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు మిరియాల వెంకట శేషగిరిబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ, నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అందిన ఫారం-6, ఫారం-7 దరఖాస్తులను పరిశీలించారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను కూడా పరిశీలించారు. దీనికి సంబంధించి రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల్‌కిషోర్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, తహశీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్య.కా.స 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో వచ్చేనెల 8,9,10 తేదీల్లో నిర్వహిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభకు విరాళాలు అందించి విజయవంతానికి సహకరించాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలో ఇంటింటికీ తిరిగి విస్తత ప్రచారం చేశారు. తొలుత స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి సంఘం జెండాను రవి ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయన్నారు. కూలీలకు జిఒల ప్రకారం కూలి అందడం లేదన్నారు. వ్యవసాయరంగంలో యంత్రాలు పెరగడంతో పనులు దొరక్క వ్యవసాయ కార్మికులు పొట్టకూటి కోసం వలసలు వెళ్లి బతికే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చట్టాన్ని నీరుగార్చడానికి కుట్ర చేస్తుందని మండిపడ్డారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, తెల్లం రామకృష్ణ, ఎ.రాణి, ఎస్‌కె.సుభాషిణి, తామ ముత్యాలమ్మ, టి సత్యనారాయణ, పసల సూర్యారావు, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు, వి.గోపి పాల్గొన్నారు.

25 నుంచి ఏలూరులో పిడిఎస్‌యు 21వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పిడిఎస్‌యు 21వ రాష్ట్ర మహాసభ ఈనెల 25, 26, 27 తేదీల్లో ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నట్లు పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఐఎఫ్‌టియు కార్యాలయంలో పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా రవిచంద్ర, రామ్మోహన్ మాట్లాడుతూ పిడిఎస్‌యు 21వ రాష్ట్ర మహాసభ సందర్భంగా తొలరోజు 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఇండోర్ స్టేడియం వద్ద నుండి విద్యార్థులతో ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు అశోక్ నగర్‌లోని కెపిడిటి పాఠశాల గ్రౌండ్, జార్జి రెడ్డి ప్రాంగణంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్యవక్తగా జార్జిరెడ్డి సినిమా దర్శకులు బి.జీవన్ రెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర అధ్యక్షతన జరిగే ఈ బహిరంగ సభలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఎఐకెఎంఎస్.రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు. వెంకటేశ్వరరావు, పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరి శ్రీమన్నారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పి.శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్, పిడిఎస్‌యు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.భూషణం తదితరులు ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని ప్రతినిధులు తెలిపారు. 26, 27 తేదీల్లో కామ్రేడ్ సుసేన హాలు, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ప్రాంగణం (మర్చంట్ ఛాంబర్ కల్యాణమండపం)లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. 26వ తేదీ ఉదయం పది గంటలకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు బిఎ.సాల్మన్‌రాజు స్వాగత ఉపన్యాసం చేస్తారని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా మహాసభ ప్రతినిధుల సభ ప్రారంభ ఉపన్యాసం చేస్తారన్నారు. పంజాబ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ ఇతర రాష్ట్రాల విద్యార్థి సంఘ నాయకులు సందేశాలిస్తారన్నారు. అలాగే ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియు పిఒడబ్ల్యూ, అరుణోదయ తదితర ప్రజాసంఘాల సందేశాలుంటాయని తెలిపారు. విద్యా-గోష్టిలో 'నూతన విద్యా విధానం' అనే అంశంపై సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లడతారని తెలిపారు. 27న విద్యా గోష్టిలో 'హిందుత్వం - ఫాసిజం' అంశంపై విప్లవ రచయితల సంఘం నేత సిఎస్‌ఆర్.ప్రసాద్ మాట్లాడతారన్నారు. విద్యార్థి ఉద్యమాలపై సంస్థాగతంగా సమీక్ష ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఎంపిక చేసిన 300 మంది విద్యార్థి ప్రతినిధులు మహాసభలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పి డి ఎస్ యు 21వ ఏపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకి నాని, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.క్రాంతి, జిల్లా నాయకులు జానకిరామ్, నాయకులు శివ, రవి పాల్గొన్నారు.

చింతలపూడి : ఈనెల 25 నుంచి జరిగే పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను యూనియన్ పట్టణ నాయకులు బి.నాయక్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు.

బిజెపి, వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్రంలో బిజెపిని తరిమికొట్టి, రాష్ట్రంలో వైసిపిని బంగాళాఖాతంలో కలపాలని, లేకుంటే రాష్ట్రం అధోగతి పాలవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం పార్టీ జిల్లా సమితి విస్తృతస్థాయి సమావేశం స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాల్లో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలు చేస్తుందని, అదో మతోన్మాద, అభివృద్ధి నిరోధక పార్టీ అని విమర్శించారు. దేశంలో మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తూ మతోన్మాదమే ఎజెండాగా అమలు చేస్తున్నారన్నారు. ప్రమాదకర రాజకీయాలు చేస్తూ తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను కూల్చడమే ధ్యేయంగా మోడీ పాలన సాగిస్తున్నారన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఫిరాయింపులు ప్రోత్సహించడం ద్వారా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చి బిజెపి దొడ్డిదారిన అధికారం చేపట్టిందని విమర్శించారు. కమ్యూనిస్టులు ఏకంకావాలని లౌకిక శక్తులు, ప్రజాతంత్రవాదులను కలుపుకుని వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో సిఎం జగన్ పాలన గాలికి వదిలేశారని విమర్శించారు. మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజల వద్ద నుండి గానీ రాజకీయ పార్టీల నుండి ఒక్క విజ్ఞాపన పత్రం కూడా తీసుకొని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో తన సొంత బ్రాండ్ల మద్యాన్ని విస్తతంగా విక్రయిస్తూ కోట్లాది రూపాయలను వెనకేసుకుంటున్నారన్నారు. ఇసుక మాఫియా రాజ్యమేలుతూ ఇసుక కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, ప్రాజెక్టు నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు, కడప ఉక్కు కర్మాగారం తదితర సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే దమ్ము, ధైర్యం జగన్‌కు లేవన్నారు. ఇటీవల ప్రధాని మోడీ విశాఖపట్నంలో రాష్ట్ర సమస్యలపై కనీస ప్రస్తావన చేయకపోవడం మోడీ అహంకార వైఖరికి నిదర్శనమన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కమ్యూనిస్టుల బలోపేతంతోనే రాష్ట్రానికి విముక్తి అన్నారు. యువజన, విద్యార్థి విభాగాలపై దృష్టి సారించి పటిష్టపరచడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలన్నారు. రైతు సమస్యలపై కార్యాచరణ రూపొందించి రైతు ఉద్యమం చేపట్టాలన్నారు. మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ వచ్చేనెల 26వ తేదీన కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడలా ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో రైతు, విద్యార్థి యువజన సంఘాల్లో కమిటీలు వేయాలన్నారు. పార్టీ సభ్యత్వాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు భత్తుల వెంకటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై లక్ష్మీకాంతం పోరాటం ఎనలేనిది

వర్ధంతి సభలో ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి

ప్రజాశక్తి - ఏలూరు

ఐద్వా నేత తిప్పాని లక్ష్మీకాంతం మహిళా సమస్యలపై చేసిన పోరాటాలు మరువలేనివని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అన్నారు. లక్ష్మీకాంతం ఏడో వర్ధంతి సభ ఏలూరు నగర కమిటీ అధ్వర్యంలో స్థానిక గన్‌బజార్ సెంటర్‌లో జి.శారద అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సభలో హైమావతి మాట్లాడుతూ నిరంతరం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతున్న ఐద్వాకు లక్ష్మీకాంతం ఎన్నో సేవలందించారన్నారు. ఐద్వా ఏలూరు పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన కాలంలో మహిళల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జి.శారద, టి.సుకన్య, నాయకులు దుర్గ, ఎన్.రాజేశ్వరి, పి.వరలక్ష్మి, జి.సోనిక, ఎన్.నవదుర్గ, మేరి, భవాని, మాధవి, సిఐటియు నాయకులు పి.కిషోర్ పాల్గొన్నారు.

ఆటో, ట్రాలీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆటో, ట్రాలీ ఓనర్స్, డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆటో, ట్రాలీ ఓనర్స్ అండ్ డ్రైవర్ల యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కెవిఎ.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బొర్రంపాలెం శివారులోని వీరభద్రవరం ఆటో స్టాండ్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. డ్రైవర్ల సమస్యలు తెలుసుకున్నారు. పోలీసుల, ఆర్‌టిఎ అధికారుల వేధింపులు ఆపాలని బీమా, ప్రీమియం ధరలు తగ్గించాలని, విడిభాగాల ధరలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


స్థానిక 28వ డివిజన్ పుష్పలీలా నగర్‌లోని నాలుగో రోడ్డులో ఏర్పడిన గుంతలను ఆ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణసురేష్ తనసొంత నిధులతో బుధవారం పూడ్చించారు. అలాగే ద్వారకానగర్‌లో అధ్వానంగా ఉన్న ఒకటో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రాజగాల సుబ్బారావు వీధి నుండి ద్వారకానగర్ ఒకటో రోడ్డుకు వచ్చే మెయిన్ రోడ్‌లో ఉన్న డ్రైయినేజీ పూడికతీత పనులను కూడా ఆయన చేయించారు.


ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

16,926 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో ఇప్పటి వరకూ 16,926 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఏలూరు ఆర్‌డిఒ, ధాన్యం సేకరణ మండల ప్రత్యేక అధికారి కె.పెంచల్‌కిషోర్ తెలిపారు. ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ మండల పరిధిలోని మూడు సొసైటీలు, 24 రైతు భరోసా కేంద్రాల ద్వారా 384 మంది రైతుల నుండి 16,926 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇప్పటి వరకూ ఆరు లక్షల 40 వేల సంచులను రైతులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎవి.రమణారావు, అధికారులు పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ

మళ్లీ వైసిపిదే విజయం

ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - చాట్రాయి

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి విజయం ఖాయమని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బూరుగుగూడెంలో బుధవారం సర్పంచి దేశిరెడ్డి హైమావతి, ఎంపిపి లంక నిర్మల ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహశీల్దార్ విశ్వనాధరావు, ఎంపిడిఒ మురళీమోహన్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం:రెడ్డిగణపవరం సచివాలయ పరిధిలోని రేగులకుంట, జగ్గిశెట్టిగూడెం, పాలకుంట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.




సర్టిఫికెట్ అందిస్తున్న కృష్ణ

నైతిక విలువలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- జంగారెడ్డిగూడెం

విద్యతో పాటు నైతిక విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ అన్నారు. బుధవారం రోటరీ కార్యదర్శి రామ్‌గోపాల్ నిర్వహణలో స్థానిక త్రివేణి విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యాప్రగతి-వృత్తినైపుణ్యం-విలువలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మానవీయ, నైతిక విలువలు కోల్పోతే విద్యలో ఎంత ప్రగతి ఉన్నా నిరుపయోగమన్నారు. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోకపోతే రాణించలేమని, విద్యార్థి దశ దాటి జీవితంలో ఏదో ఒక రంగంలో స్థిరపడినా వ్యక్తి నిరంతర విద్యార్థిగా జరుగుతున్న మార్పులు గమనిస్తూ సాంకేతికతను పెంపొందించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ హనుమరఫనీశ్‌రామ్, రోటరీ ప్రతినిధులు ధనకుమార్, వెంకట రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్లాసులు అందిస్తున్న నరసింహారావు

హాస్టల్ విద్యార్థులకు గ్లాసుల వితరణ

ముసునూరు:హాస్టల్ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని పంచాయతీరాజ్ ఎఇ టివి.నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బాలుర బిసి హాస్టల్ విద్యార్థులకు స్టీల్ గ్లాసులను బుధవారం అందజేశారు. ముసునూరులోని బిసి హాస్టల్‌కు వెళ్లి తన తండ్రి జ్ఞాపకార్థం గ్లాసులను అందించారు. అలాగే గదుల్లోకి దోమలు రాకుండా కిటికీలకు తన సొంత నిధులతో మెస్ అమర్చారు. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనకు దాతలు తమవంతు సహకారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఇ కూచిపూడి సాయిరామ్, హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్, సిబ్బంది వాసు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కూల్చివేత

రోడ్డునపడ్డ ఐదు కుటుంబాలు

ప్రజాశక్తి - నూజివీడు


గొల్లపల్లి పిహెచ్‌సి సమీపంలో పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు బుధవారం అన్యాయంగా తొలగించారు. 15 మంది వీఆర్‌ఓలు, వీఆర్‌ఎలు కలిసి జెసిబి సాయంతో వాటిని కూల్చివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ పేదలు వేడుకున్నా వినకుండా తొలగించారు. దీంతో ఐదు కుటుంబాల ప్రజలు రోడ్డున పడ్డారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ పోరంబోకు భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, ఉన్నఫళంగా వాటిని తొలగిస్తే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పెద్దమనుషులమని చెప్పుకుంటూ వందలాది ఎకరాలు కబ్జా చేస్తుంటే వాటిని తొలగించలేని అధికారులు పేదలపై ప్రతాపం చూపించడం అన్యాయమన్నారు. ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాలతో, తహశీల్దార్ ఎర్రా ప్రకాశరావు అధికార పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గొల్లపల్లిలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేసి పక్కా నిర్మాణాలు చేసిన బడా భూస్వాముల జోలికి కూడా వెళ్ళని అధికారులు పేదలను ఎలా రోడ్డుకీడుస్తారని ప్రశ్నించారు. నివాసం కోల్పోయిన పేదలకు ప్రభుత్వమే జగనన్న కాలనీల్లో స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు.


కూల్చివేసిన గుడిసెలు

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో తెలుగు విద్యార్థి సంక్షేమ హాస్టల్ పోరుబాటలో భాగంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్షిత తాగునీరు లేదని, చేతులు కడుక్కోవడానికి వాడే నీటినే తాగడానికి ఉపయోగించాల్సి వస్తుందన్నారు. ఫ్యాన్లు తిరగడం లేదని, టాయిలెట్ల వద్ద శానిటైజేషన్ సరిగా లేదని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ఇవాల్సిన కాస్మోటిక్స్ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో అన్ని వసతులూ కల్పించే వారన్నారు. గదుల్లో శ్లాబు పెచ్చులూడిపోతున్నాయని, కిటికీలు సరిగా లేవని తెలిపారు. బియ్యం కూడా మొద్దు బియ్యం, అన్నం చిమిడి పోతుందన్నారు. గతంలో ఆడుకోవడానికి ఆట వస్తువులు ఇచ్చేవారని ప్రస్తుతం ఒక్క కిట్టు కూడా లేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. చదువుకోవడానికి, తినడానికి ఆరుబయట షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. వసతి గృహం బయట డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బంది వస్తుందని, పిల్లలు డ్రెయినేజీ దాటుకుని వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యలను టిఎన్ఎస్ఎఫ్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి పారేపల్లి నరేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి మట్టే, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పారేపల్లి పవన్‌కుమార్, కొయ్యలగూడెం మండల అధ్యక్షులు తంకట రాకేష్, జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు గాలి చైతన్య, ప్రధాన కార్యదర్శి నాయుడు పవన్, ఉపాధ్యక్షులు ఎ.జగత్ పాల్గొన్నారు.


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

జంగారెడ్డిగూడెం:హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో తెలుగు విద్యార్థి సంక్షేమ హాస్టల్ పోరు బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి చైతన్య, ప్రధాన కార్యదర్శి నాయుడు పవన్, ఉపాధ్యక్షులు జగత్ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గద్దె జశ్వంత్, నాయకులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకటమణి

విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మినుము పంటలో రైతులు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటమణి అన్నారు. మండలంలోని వడాలి, పెయ్యేరు రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించి రైతులకు మినుము పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మినుము పంటలో వచ్చే తెగుళ్లు, వైరస్‌ల నిర్మూలనకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. విత్తనశుద్ధి ద్వారా పల్లాకు, తలమాడు, శీతాఫలం వంటి మూడు తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఖరీఫ్ పంటకు సంబంధించిన ఇ-క్రాప్ రశీదులను రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బొర్రా మాదవ్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

దేశి రెడ్డికి తిరువూరు ఎంఎల్ఎ సన్మానం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి సభ్యులు తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎపి కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణనిధి ప్రత్యేకంగా సన్మానించారు. బూరుగుగూడెంలోని రాఘవరెడ్డి నివాసానికి ఎంఎల్ఎ చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాఘవరెడ్డి దంపతులను సన్మానించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ

ఆసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపిపి గంజిమాల రామారావు అన్నారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా రామారావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఆర్థిక వనరులు సమీకరించి రోగులకు అన్ని రకాల వైద్య సేవలందించేలా కృషి చేస్తానన్నారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషిన్ కాన్సెప్ట్, ఆసుపత్రి ప్రసవాలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడానికి కషి చేస్తానన్నారు. కమిటీ సభ్యులుగా కొయ్యలగూడెం ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్, తహశీల్దార్ పి.నాగమణి, పరింపూడి సర్పంచి ముప్పిడి విజయకుమారి, దిప్పకాయలపాడు సర్పంచి సున్నం శాంతికుమారి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో వెస్టన్ డెల్టా బోర్డు ఛైర్మన్ గంజిమాల దేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్టా వనజలక్ష్మి, పరింపూడి ఉప సర్పంచి సంకు కొండలరావు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ట్రైనీ వైద్య సిబ్బంది

రోగులతో ప్రేమగా ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో సిబ్బంది ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలని తహశీల్దారు స్లీవజోజీ సూచించారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ట్రైనీ స్టాఫ్‌నర్స్‌లకు క్యాపింగ్ శర్మనీ కార్యక్రమం నర్సింగ్ సూపరింటెండెంట్ సామ్రాజ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది రోగులపై ఉదార భావం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు బేబీ కమల, అభివృద్ధి కమిటీ సభ్యులు రాపోలు బావనరుషి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు..



బాదుడే - బాదుడు కార్యక్రమంలో టిడిపి నేతలు

ధరల అదుపులో వైసిపి విఫలం : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నిత్యావసర ధరలను అదుపు చేయడంలో వైసిపి విఫలమైందని టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ విమర్శించారు. ఆయన ఆధ్వర్యంలో తెడ్లం, రాజుపోతేపల్లి గ్రామాల్లో బుధవారం బాదుడే బాదుడు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరావు, ఆచంట సూర్యనారాయణ, ఆచంట అనిల్ కుమార్, కొల్లి మురళి, కొండపల్లి రవి పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్ఐవి అవగాహనపై ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎఆర్‌హెచ్ఇడిఎస్) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం మేనేజర్ కీర్తి శిరీష తెలిపారు. బుధవారం సోమవరప్పాడు, తంగెళ్లమూడి, ఏలూరులోని పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీధినాటిక రూపంలో ఎల్ఆర్ కృష్ణబాబు బృందం ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. వీధినాటకాలతో హెచ్ఐవిపై ప్రజలకు అవగాహన కల్పనలో భాగంగా కరపత్రాలు, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఎఆర్‌హెచ్ఇడిఎస్ సిబ్బంది, ఒఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది ఎ.ఆరుణ, బి.సురేష్, ఎఎన్ఎం కె.ప్రభావతి, అకౌంటెంట్ ఎమ్‌డి షకీనా, ఎన్‌జిఒ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను హడలెత్తిస్తున్న వాయుగుండం

ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

వాయుగుండం ప్రభావంతో అన్నదాత పడరాని పాట్లు పడుతున్నాడు. మండలంలో బుధవారం తెల్లవారుజామున మరోసారి వర్షం పడింది. దీంతో రైతులు అందోళన చెందుతున్నారు. కోసిన పంట చేల్లో పనలపై ఉండడంతో పాటు రోడ్లపై అరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. మండలంలో వందలాది ఎకరాల్లో వరిపైరు పనలపై ఉండడంతో వర్షనికి తడిసిపోయింది. దీంతో రైతులు పనలను అరబెట్టుకునేందుకు చేలల్లో అవకాశం లేకపోవడంతో గట్లపై, రోడ్ల వెంబడి అరబెట్టుకుంటున్నారు. ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో ఉండడంతో మళ్లీ వర్షం పడుతుందేమోననే భయంతో రైతులు హైరానాపడ్డారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో పంట చేతికి వస్తుందో లేదో తెలియక రైతులు దిగాలు చెందుతున్నారు. దీనికి తోడు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్ యాప్ మండలంలో పలు చోట్ల పని చేయకపోవడంతో రైతులు గంటల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆన్‌లైన్ పని చేయకపోతే ఆఫ్‌లైన్‌లో కొనుగోలు ప్రకియ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా ఇది ఎక్కడా అమలు కావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.


వరి పనలను ఆరబెడుతున్న కూలీలు

రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా కొనుగోలు చేస్తామని ఇటీవల జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు ముదినేపల్లి మండలం వడాలి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా మీడియా సమక్షంలో ప్రకటించారు. జెసి ప్రకటించి 24 గంటలు గడవక ముందే మంగళవారం ఉదయం ఆరు గంటలకు మండల వ్యవసాయాధికారికి ఆన్‌లైన్‌లో మాత్రమే ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు రావడంతో మంగళవారం నుంచి మళ్లీ ఆన్‌లైన్‌లోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ప్రస్తుతం ఉన్న వాతావరణం దృష్ట్యా ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

ఎస్‌బిఐ కలెక్ట్ అప్లికేషన్ ద్వారానే ఫీజు కట్టాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులకు ఎస్‌బిఐ కలెక్ట్ అప్లికేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎన్.చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు కట్టే ఫీజు ఎస్‌బిఐ కలెక్ట్ అప్లికేషన్ ద్వారా చెల్లించడంపై అవగాహన కల్పించారు. నిర్మల కుమారి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఫీజులను కలెక్ట్ అప్లికేషన్ ద్వారా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎస్‌బిఐ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు కె.సత్యనారాయణ, టి.అక్కిరాజు, ఎస్ఎస్‌వి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి డి.వి.చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న పుట్టినరోజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి పట్టణ కార్యదర్శి, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న పుట్టినరోజును స్థానిక వైసిపి నేతలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్న, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, నాయకులు చంద్రరావు, మేడవరపు విద్యాసాగర్, కౌన్సిలర్ సంకు సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ పి.మల్లీశ్వరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ రాజ్ ఎఇ శ్రీనివాసరావు ఉన్నారు.

వనసమారాధనలో కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

డివిజన్ అటవీశాఖ సామాజిక వన విభాగం ఏలూరువారి ఆధ్వర్యంలో తడికలపూడిలో ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధనలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి భోజనం చేసి ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన బహుమతులు అందించారు.

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పలువురు అదనపు ఎస్‌పి కేడర్ అధికారులకు నాన్ క్యాడర్ ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా విధులు నిర్వహిస్తున్న కె.చక్రవర్తికి ఉద్యోగోన్నతి కల్పించడంతో పాటు పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి కేంద్రంగా రెడ్ శాండిల్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌పిగా ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు.


జరిమానా విధిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ కవర్ల అమ్మకందారులకు జరిమానా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర పాలక సంస్థ పరిధిలోని వన్‌టౌన్ ప్రాంతంలోని ప్రధాన మార్కెట్లలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్స్‌ను సీజ్ చేసి అమ్మకందారులకు జరిమానా విధించినట్లు హెల్త్ అధికారి డాక్టర్ మాలతి తెలిపారు. ఫ్యాన్సీ, పలువ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. 75 మైక్రాన్ల కన్నా తక్కువ ప్లాస్టిక్ వస్తువులు, కవర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధించామన్నారు. నగరంలో ఇప్పటికే ప్లాస్టిక్ నివారణపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానా విధిస్తామన్నారు. సుమారు 150 కేజీల ప్లాస్టిక్ కవర్స్‌ను, ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేందర్, పారిశుధ్య విభాగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూజివీడు పట్టణానికి చెందిన జగన్నాథం పండు(43) బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనివద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుణ్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.